క్లుప్తంగా

బాస్కెట్‌బాల్ కోర్ట్ అభివృద్ధి చేయాలి



వినతిపత్రం ఇస్తున్న పీడీలు, క్రీడాకారులు

జగిత్యాల: కోరుట్లలోని క్రీడా మైదానంలో ఉన్న ఖోఖో, హ్యాండ్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్ కోర్టులను అభివృద్ధి చేయాలని సోమవారం క్రీడాభివృద్ధి శాఖ అధికారి రవికుమార్‌కు పీడీలు, క్రీడాకారులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టేడియంలో కోర్టుల్లో మౌలిక వసతులు లేక క్రీడాకారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, అభివృద్ధి పర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పంట పొలాలకు నల్ల మట్టి ఉపయోగకరం

కోరుట్లటౌన్: పంట పొలాలకు నల్లమట్టి ఎరువుగా ఎంతో ఉపయోగపడుతుందని మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మాట్లాడారు. పట్టణంలోని తాళ్ల చెరువులో పూడిక తీత పనులు మొదలుపెట్టనున్నట్లు ఆయన తెలిపారు. నల్లమట్టి కావాల్సినవారు మున్సిపల్ కార్యాలయంలో ఇంజినీరింగ్ సెక్షన్‌లో సంప్రదించాలన్నారు. ఒక క్యూబిక్ మీటర్ నల్లమట్టికి రూ.162.56లను డీడీ తీసి, మున్సిపల్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్ కోరారు.

మూడు రోజుల్లో కూలీల వేతనాలు జమ



కూలీలతో మాట్లాడుతున్న అడిషనల్ పీడీ

సారంగాపూర్: ఉపాధిహామీ కూలీల వేతనాలు రెండు మూడు రోజుల్లో వారి ఖాతాల్లో జమవుతాయని డీఆర్డీవో అడిషనల్ పీడీ మదన్‌మోహన్ అన్నారు. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో సోమవారం పర్యటించి కూలీలు, ఉపాధిహామీ సిబ్బందితో మాట్లాడారు. కూలీలు వేతనాలపై ఆందోళన చెందవద్దని, త్వరలోనే తమ ఖాతాల్లో డబ్బులు జమవుతాయన్నారు. ఆయన వెంట ఎంపీడీవోలు చౌడారపు గంగాధర్, లచ్చాలు, ఈజీఎస్ ఏపీవోలు శ్రీలత, స్వప్న, ఫీల్డ్ అసిస్టెంట్ రవి ఉన్నారు.

ఉపాధి హామీ పనులు పరిశీలన

కోరుట్ల రూరల్: మండలంలోని చిన్న మెట్‌పల్లిలో ఉపాధిహామీ పనులను ఎంపీడీవో ఓదెల రామకృష్ణ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కూలీలకు ప్రతి రోజూ రూ.307 కూలి పడే విధగా పని చేయాలని సూచించారు. పని ప్రదేశంలో తాగు నీరు, మెడికల్ కిట్, ఉండాలని కార్యదర్శిని ఆదేశించారు. పల్లె ప్రకృతి వనం, నర్సరీ ,హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. నీటి సరఫరా లేని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రేమలత,రవి, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కథలాపూర్: మండలంలోని పోసానిపేటలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలో ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తే దొంగతనాల నివారణ తోపాటు భద్రత ఉంటుందన్నారు. గ్రామంలో గంజాయి, మత్తు పదార్థాలు సేవించడం గాని, విక్రయించడం గాని చేయవద్దన్నారు. అపరిచిత వ్యక్తులు చేసే ఫోన్‌కాల్స్‌కు స్పందించవద్దని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు నీలా నాయక్, పురుషోత్తం, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

దుకాణాలు సీజ్

మెట్‌పల్లి: పట్టణంలోని దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న ఎడ్మల లక్ష్మారెడ్డి ట్రస్ట్‌కు సంబంధించిన ఆరు దుకాణాలను సోమవారం అధికారులు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో అందులో ఉన్న దుకాణాదారులను ఖాళీ చేయాలని పలుమార్లు నోటీసులు ఇచ్చారు. దీనికి వారు స్పందించకపోవడంతో ట్రస్ట్ చైర్మన్ కొమ్ముల సంతోష్ రెడ్డి సమక్షంలో వాటిని సీజ్ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది రాజేందర్, గంగాధర్, శివకేశవ్ తదితరులున్నారు.

మారిన ‘ఉపాధి’ నిబంధనలు

- కొలతల ప్రకారం పని చేయాల్సిందే
- పనుల చోటే ఫొటో క్యాప్చరింగ్
- రోజుకు రూ.307 వచ్చేలా పనులు
- వేధిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల కొరత



లక్ష్మీదేవిపల్లిలో పనులకు హాజరైన కూలీలు

సారంగాపూర్: ఉపాధి హామీ పథకం నిబంధనలు పూర్తిగా మారాయి. కూలీలకు ప్రతిరోజూ రూ.307 లభించేలా నిర్ణయించిన కేంద్రప్రభుత్వం.. ఆ మేరకు నిబంధనలను మార్చింది. నిర్దేశిత కొలతల ప్రకారం పని చేయాల్సిందేనని, పని ప్రదేశంలోనే ఫొటో క్యాప్చరింగ్ తప్పనిసరి అని పేర్కొంది. ఉపాధి పథకానికి అన్ని గ్రామాల్లో ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోంది. ప్రతీ ఒక్కరు పనులకు వెళ్లడానికి తమ కుటుంబం పేరున జాబ్‌కార్డు పొందుతున్నారు. సారంగాపూర్ మండలంలో మొత్తం 18 గ్రామాలు ఉన్నాయి. వీటి పరిధిలో 4,223 జాబ్‌కార్డులు ఉన్నాయి. కూలీలు 5,910 మంది ఉన్నారు. వీరంతా ప్రతిరోజూ కూలికి వెళ్తుండగా.. మారుతున్న నిబంధనలతో సిబ్బందిపై పని ఒత్తిడి పెరుగుతోంది.

- ➡ కూలికి గతేడాది మార్చి 31వరకు రోజు రూ.100 నుంచి రూ.150 వరకు కూలి వస్తుండేది. కొన్నిసార్లు తక్కువ పడిన రోజులు ఉన్నాయి.
- ➡ ఈ ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ప్రతి కూలి రోజుకు రూ.307 తప్పనిసరిగా పొందాలని కేంద్రం నిబంధన విధించింది.
- ➡ రైట్ వర్క్, రైట్ పేమేంట్ రీతిలో రూ.307 కూలి వచ్చేలా అటవీ ప్రాంతాల్లో మూడు మీటర్ల పొడవు, మీటరు వెడల్పు, 65సెంటీమీటర్ల లోతు తప్పనిసరిగా తవ్వాల్సిందే.
- ➡ ప్రతిరోజూ రెండుసార్లు ఫొటో క్యాప్చరింగ్ చేయాలి
- ➡ కూలీ పని ప్రారంభించే సమయంలో ఎక్కడ పనిచేస్తున్నారో ఆ ప్రదేశాన్ని ఫీల్డ్ అసిస్టెంట్ ఫొటో క్యాప్చరింగ్ చేయాలి
- ➡ పని ముగిసిన తరువాత కొలతలు సరిగా ఉంటే మరోసారి కూలితో కలిపి ఫొటో క్యాప్చరింగ్ చేయాల్సి ఉంటుంది.
- ➡ తరువాత ఆన్‌లైన్‌లో అటెండెన్స్ నమోదు చేయాలి
- ➡ ఇవన్నీ కూలి పనుల వద్ద ఉన్నప్పుడే ఫీల్డ్ అసిస్టెంట్ నిర్వర్తించాల్సి ఉంటుంది.

కూలీలకు ఇబ్బంది

కూలీలు పనులు ముగించుకున్న తరువాత ఫొటో క్యాప్చరింగ్ పూర్తయ్యేవరకూ పనుల వద్దే ఉండాల్సి వస్తోంది. పనులు త్వరగా ముగించినప్పటికీ ఇంటికి చేరుకోవడం చాలా ఆలస్యం అవుతోందని కూలీలు పేర్కొంటున్నారు. ఒకే మొబైల్ నుంచి ఫొటో క్యాప్చరింగ్ చేయాల్సి రావడంతో కూలీల సంఖ్య పెరిగినప్పుడు ఫీల్డ్ అసిస్టెంట్లకు ఇబ్బందిగా మారుతోంది. అదనపు మేట్లను ఏర్పాటు చేసుకుని ఫొటో క్యాప్చరింగ్ చేసే వెసులుబాటు లేకపోవడంతో చాలా సమయం వృథా అవుతోందని చెబుతున్నారు. మరోవైపు మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్ల కొరత తీవ్రంగా ఉంది. 18 గ్రామాలకు కలిపి 9 మంది మాత్రమే ఉన్నారు.

ఫొటోలకు సమయం పడుతోంది



పనుల వద్ద రెండుసార్లు ఫొటోలు తీయాల్సి రావడంతో చాలా సమయం పడుతోంది. ఒక రోజు ఫొటో క్యాప్చరింగ్‌లో సిగ్నల్ సమస్య ఏర్పడితే.. తిరిగి మరుసటి రోజు పని వద్దకు వెళ్లి ఫొటో దిగాల్సి వస్తోంది. డబ్బులు కూడా తొందరగా పడడం లేదు.

– టేకు శిరీష, పెంబట్ల, ఉపాధి కూలీ

ఎంతమంది వచ్చినా పని



జాబ్‌కార్డు ఉన్నవారందరికీ పని కల్పిస్తున్నాం. ముందుగా కొన్ని సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఫీల్డ్ అసిస్టెంట్లు లేని చోట మేట్లతో పనులు కొనసాగిస్తున్నాం. ప్రతీ కూలీకి రూ.307 కూలి రావాలని కొంత నిబంధన అమలు చేస్తున్నాం.

– గంగాధర్, ఎంపీడీవో, సారంగాపూర్

పేపర్ పువ్వు.. పేదోడి కృతజ్ఞత

- కూలీ డబ్బులు ఇప్పించిన సీఐ
- కంట తడి పెట్టించిన వైనం



కాగితం పువ్వు ఇస్తున్న బాధితుడు

కోరుట్ల: మురికి బట్టలు.. నెరసిన జుట్టు.. బట్ట బూట్లు.. వెరసి పేదోడికి పక్కా ప్రతి రూపం. సాధారణంగా ఎవరు అతని సమస్యను పట్టించుకోరు. అలాంటి స్థితిలోనే ఓ వలస కూలీ వ్యక్తి కోరుట్ల ఠాణా మెట్లు ఎక్కాడు. కోరుట్ల సీఐ కార్యాలయం వద్ద అటు ఇటు తిరుగుతున్న క్రమంలో సీఐ సురేశ్ బాబు అతన్ని పిలిచి ఏం జరిగిందని ప్రశ్నించాడు. ×సార్ నేను వలస కూలీని నా పేరు మచ్చ రాజేశ్. కోరుట్లలోని ఓ బార్‌లో పని చేశాను. కూలీ డబ్బులు రూ.6,500 రావాల్సి ఉందని, ఇవ్వమంటే బార్ యజమాని నన్ను తిట్టి వెళ్లిపొమ్మంటున్నాడు. నా తల్లిని, భార్య, పిల్లలను అవే పైసలతో సాదుకోవాలి.. నాకు న్యాయం చేయండని౯ ప్రాధేయపడ్డాడు. అతని పరిస్థితి గమనించిన సీఐ తన గన్‌మెన్ సురేశ్‌కు చెప్పి బార్ యజమానికి ఫోన్ చేసి రాజేశ్‌కు రావాల్సిన డబ్బులు ఇవ్వమని చెప్పించాడు. పదిహేను నిమిషాల వ్యవధిలో సదరు బార్ యజమాని వచ్చి రాజేశ్‌కు ఆ కూలీ డబ్బులు ఇచ్చేశాడు. ఆ తరువాత ఐదు నిమిషాల వ్యవధిలో ఓ న్యూస్ పేపర్ తీసుకొని దాన్ని అందమైన పువ్వుగా మలిచాడు. సార్ నాకు రావాల్సిన డబ్బులు రావని అనుకున్నా.. నా కుటుంబానికి నెల రోజుల అన్నం పెట్టించావ్.. అని కంటతడి పెట్టుకుంటూ .. ఆ కాగితపు పువ్వును సీఐ సురేష్ బాబుకు ఇచ్చి కృతజ్ఞతలు తెలిపాడు.

ధాన్యంలో తేమ శాతం చూసుకోవాలి

ధర్మపురి: కొనుగోలు కేంద్రాలకు తెచ్చే రైతులు ధాన్యంలో 17 శాతం చూసుకుని తీసుకురావాలని డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని కమలాపూర్, నాగారం గ్రామాల్లో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ చైతన్య, సహకార సంఘం డైరెక్టర్లు ఎల్లాగౌడ్, గడ్డం భాస్కర్ రెడ్డి, రఫియొద్దీన్ సీఈవో అయ్యోరి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలు స్థాయికి మించి వైద్యం చేయొద్దు

మెట్‌పల్లిరూరల్:ఆర్‌ఎంపీలు స్థాయికి మించి వైద్యం చేయవద్దని, అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మెట్‌పల్లి మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆర్‌ఎంపీలతో సోమవారం నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నిబంధనల ప్రకారం ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని స్పష్టం చేశారు.ఏ విధమైన ఇంజక్షన్లు ఇవ్వకూడదని,ఐవీ ఫ్లూయిడ్స్ పెట్టరాదన్నారు. కొందరు ఆర్‌ఎంపీలు ఆస్పత్రుల పేరిట బోర్డులు ఏర్పాటు చేసుకుంటున్నారని, అలాంటివి చేయకూడదన్నారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మెడికల్ షాపుల్లో మందులు అమ్మరాదని తెలిపారు. ఆర్‌ఎంపీలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక వికాసం

మల్లాపూర్: క్రీడలు మానసిక వికాసానికి దోహదపడుతాయని స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో సీనియర్ నాయకుడు గడ్డం సోమరెడ్డి అందించిన వాలీబాల్ కిట్, స్పోర్ట్స్ టీ–షర్టు(జెర్సీ)లను విద్యార్థులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు విద్యార్థులు చదవుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పీఈటీ విక్రమ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో చేర్పించండి

బుగ్గారం: మండలంలోని గోపులాపూర్‌లో సోమవారం ఎంఈవో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బడిబాట చేపట్టారు. పాఠశాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి, ప్రభుత్వ బడులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పాఠశాలలో అన్ని రకాల సదుపాయాలు,అర్హత,అనుభవం కలిగిన టీచర్లు ఉన్నారని, పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణకుమార్, టీచర్లు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

బడిబాట విజయవంతం చేయాలి

మల్లాపూర్: పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని మండల విద్యాధికారి దామోదర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ముత్యంపేట, చిట్టాపూర్, సాతారం, పాతదాంరాజుపల్లి గ్రామాల్లో సోమవారం బడిబాట చేపట్టారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు జంగ గంగాధర్, అంబటి భూమేశ్వర్, మొల్కిమోర్‌రెడ్డి, వేణు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఫ్లెక్సీ చించిన దుండగులను శిక్షించాలి

రాయికల్: పట్టణంలోని కొమురంభీం చౌరస్తాలో మహేందర్‌బాబు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌తో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తుతెలియని దుండగులు చించారని, వెంటనే వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ సోమవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అభిమానులు రాయికల్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తూ అభివృద్ధికి పాటుపడుతున్నారనే అక్కసుతో జీర్ణించుకోలేని దుండగులు ఫ్లెక్సీని చించేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో గన్నె రాజిరెడ్డి, పడిగెల రవీందర్ రెడ్డి, రవీందర్‌రావు, కోల శ్రీనివాస్, బెజ్జంకి మోహన్, చంద్రశేఖర్, సాయిరెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు కింద పడి వ్యక్తికి తీవ్రగాయాలు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ వద్ద బస్సు డ్రైవర్ అజాగ్రత్తతో ఓ ప్రయాణికుడి కాలు నుజ్జునుజ్జు అయింది. జగిత్యాల రూరల్ మండలం బాలపల్లి గ్రామానికి చెందిన నర్సయ్య మంచిర్యాల వెళ్లే జగిత్యాల డిపోకు చెందిన బస్సు ఎక్కగా బస్టాండ్ బయట బస్సు నిలుపుతున్న నేపథ్యంలో నర్సయ్య బస్సు దిగుతుండగా డ్రైవర్ బస్సు వేగం పెంచడంతో నర్సయ్య బస్సు కింద పడ్డాడు. దీంతో వెనుక టైరు నర్సయ్య కాలుపై ఎక్కడంతో కాలు నుజ్జునుజ్జయింది. వెంటనే బాధితుడిని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

యాచకురాలు మృతి

మల్యాల: కొండగట్టుకు ఘాట్ రోడ్డు సమీపంలో గుర్తు తెలియని యాచకురాలు మృతి చెందింది. పారిశుధ్య కార్మికులు యాచకురాలి(55)మృతదేహాన్ని గుర్తించి, ముత్యంపేట కారొబార్ రాజేశ్వర్ దృష్టికి తీసుకెళ్లగా, రాజేశ్వర్ 100 కు డయల్‌కు సమాచారం ఇవ్వడంతో బ్లూకోట్ సిబ్బంది మధుసూదన్, సంపత్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. యాచకురాలి మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. కారోబార్ రాజేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు

జగిత్యాలటౌన్: ప్రీమియం హెల్త్ కేర్ సర్వీస్ సంస్థలో నర్సింగ్/కేర్ టేకర్ ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి బింగి సత్యమ్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏఎన్‌ఎం,జీఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్ అభ్యర్థులతో పాటు పదోతరగతి నుంచి డిగ్రీ చదివిన వారు కూడా అర్హులేనన్నారు. 18 నుంచి 45ఏళ్ల లోపు వయస్సు ఉండి ఇంగ్లిష్ పరిజ్ఞానం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్‌లోని ప్రీమియం హెల్త్ కేర్ సర్వీస్‌లో పనిచేయవలసి ఉంటుంది. ఆసక్తి, అర్హత గల నిరుద్యోగ యువతీ యువకులు 24–04–2025న ఉదయం 10–30గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు జిల్లా ఉపాధి కార్యాలయంలో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 9346558339 నంబర్‌లో సంప్రదించాల్సిందిగా సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రాయికల్: మండలంలోని అల్లీపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని అల్లీపూర్, కిష్టంపేట, సింగరావుపేట, శ్రీరాంనగర్ గ్రామాల్లో మంగళవారం ఉదయం 7 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ తుమ్మల నవీన్ తెలిపారు.

దాత సహకారంతో కంప్యూటర్ గది ఆధునీకరణ

కథలాపూర్: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో కంప్యూటర్ గదిని పూర్వ విద్యార్థి గుండేటి రాజేంద్రప్రసాద్– మమత దంపతుల ఆర్థిక సహకారంతో ఆధునీకరించారు. ఈ మేరకు సోమవారం దాత తల్లి గంగుబాయి చేతులమీదుగా కంప్యూటర్ గదిని ప్రారంభించారు. దాత సహకారం మరవలేనిదని ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మారంపెల్లి అర్జున్, ఉపాధ్యాయులు వెంకటేశం, శశిధర్, దరందీప్, ఏడుకొండలు పాల్గొన్నారు.

ఏఐ బోధన ప్రారంభం

కథలాపూర్: మండలంలోని బొమ్మెన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు కృత్రిమ మేధ (ఏఐ) తో బోధనను సోమవారం ప్రారంభించారు. జిల్లాలో ప్రయోగాత్మకంగా ఐదు పాఠశాలలను ఎంపిక చేయగా.. అందులో బొమ్మెన పాఠశాల ఉంది. ఉపాధ్యాయులకు కృత్రిమ బోధన విధానంపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు కృత్రిమ మేధ ఉపయోగపడుతుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అంబటి రవి, ఉపాధ్యాయులు సాయిరెడ్డి, రమేశ్, శివకృష్ణ, ప్రశాంత్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోషణ పక్షోత్సవాలు

రాయికల్: మండలంలోని ఒడ్డెలింగాపూర్, మంక్యానాయక్‌తండా, రాయికల్ పట్టణంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం పోషణ పక్షోత్సవాల్లో భాగంగా గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. అనంతరం పోషకాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సహారా, రమాదేవి పాల్గొన్నారు.

పెగడపల్లి: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని హోమియోపతి డాక్టర్ వినయకుమారి అన్నారు. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో న్యూట్రిషన్ ఫుడ్‌పై అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు యోగాపై శిక్షణిచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భారతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మహేశ్వరి, సుభద్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చెరువు కబ్జాదారులపై చర్యలు తీసుకోండి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న మత్స్యకారులు

జగిత్యాలటౌన్: పట్టణ సమీపంలోని తిమ్మాపూర్ శివారులోని ఊర చెరువు మత్తడిని కూల్చి వేసి కబ్జా చేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని జగిత్యాల గంగపుత్ర సంఘం ప్రతినిధులు సోమవారం ఆర్డీవో మధుసుధన్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఊర చెరువు కబ్జా విషయమై గతంలో రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. భూబకాసురుల నుంచి ఊర చెరువును కాపాడి, చెరువుపై ఆధారపడి జీవిస్తున్న 500కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ నర్సింగరావు, కె నర్సయ్య, బి రాజశేఖర్, కె రెడ్డి తదితరులు ఉన్నారు.

జీవన్‌రెడ్డికి ఫిర్యాదు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ ఊర చెరువు మత్తడిని కొంత మంది కబ్జా చేస్తున్నారని గంగపుత్ర మత్స్య పారిశ్రామిక సంఘం సభ్యులు సోమవారం రాత్రి మాజీ మంత్రి జీవన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని జీవన్‌రెడ్డి అధికారులతో ఫోన్లో మాట్లాడి ఆదేశించారు.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ విధానం



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న నరేశ్‌రెడ్డి, కరం

మల్లాపూర్: రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ విధానమని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కొమిరెడ్డి కరంచంద్ అన్నారు. మండలంలోని రాఘవపేటలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ జిల్లా డైరెక్టర్ తక్కల్ల నరేశ్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి అన్ని వర్గాలకు సమప్రాధాన్యతనిస్తు రాష్ట్రాభివృద్ధికి ఏనలేని కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అంతడుపుల పుష్పలత, సింగిల్ విండో వైస్ చైర్మన్ ఆరే రాజేందర్, సీఈవో రమేష్, కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కొమిరెడ్డి విజయ్‌ఆజాద్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మేడిపల్లి: భీమారం మండలం కేంద్రంతో పాటు వెంకట్రావుపేట, కమ్మరిపేట్ లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్ మదం వినోద్ యాదవ్ ప్యాక్స్ చైర్మన్ కసుగంటి శ్రీనులు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నరేష్ రెడ్డి, చేపూరి నాగరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పల్లి భీమయ్య, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండలంలోని పాతదాంరాజుపల్లి, కొత్తదాంరాజుపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సోమవారం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అంతడుపుల పుష్పలత, ప్యాక్స్ చైర్మన్ వేంపేట నర్సారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్లు, సీఈవో భూమేశ్, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ ఇట్టెడి నారాయణరెడ్డి, డైరెక్టర్ బద్దం రాధ, నాయకులు పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని భూపతిపూర్ గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని సోమవారం భూపతిపూర్ సింగిల్‌విండో చైర్మన్ ఏనుగు ముత్యంరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్లు లక్ష్మి, నారాయణ, గంగరాజు నాయకులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



మెడల్ అందుకుంటున్న హమీద్, అక్షిత్

జగిత్యాల/రాయికల్/బుగ్గారం/కథలాపూర్/మల్యాల/కథలాపూర్/మేడిపల్లి: రాష్ట్రీయ ఆవిష్కార్ అభియాన్‌లో భాగంగా జిల్లా స్థాయిలో సోమవారం నిర్వహించిన గణితం,సైన్స్,క్విజ్ పోటీల్లో రాయికల్, బుగ్గారం, మేడిపల్లి మండల విద్యార్థులు ప్రతిభ చాటారు. రాయికల్ మండలం కుమ్మరిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన షేక్ హమీద్, గుమ్మడి అక్షిత్, జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థి పల్లికొండ వర్షిత్,బుగ్గారం మండలం.శెకల్ల ప్రాథమిక పాఠశాలకు చెందిన అనన్య ప్రాథమిక పాఠశాలకు చెందిన ముద్దం మహాశ్రీ,మేడిపల్లి మండలంలోని కట్లకుంట ప్రాథమిక పాఠశాల విద్యార్థిని బుయ్య క్రిస్టిన,కథలాపూర్ మండలం దుంపేట ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఉడుగుల శ్రీనివాస్ బృందం ప్రతిభ చాటారు. మల్యాల మండల పరిషత్ పాఠశాల విద్యార్థిని హిమశ్రీ ద్వితీయ బహుమతి పొందగా, మద్దుట్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పి.హరిప్రియ, పి.హిమవర్ష తృతీయ బహుమతి గెలుచుకున్నారని విద్యార్థులకు డీఈవో రాము చేతుల మీదుగా మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా మా గల్ఫ్ వార్షికోత్సవం

కోరుట్ల రూరల్/మల్లాపూర్: దుబాయిలోని మా గల్ఫ్ 10వ వార్షికోత్సవం ఆదివారం రాత్రి అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మా గల్ఫ్ మీడియా ప్రతినిధులు శ్రీకాంత్–సౌమ్య దంపతులు మాట్లాడుతు గల్ఫ్ ప్రాంతాల్లోని తెలుగు వారికి వార్తలను అందించేందుకు 10 ఏళ్ల క్రితం మా గల్ఫ్ ను ప్రారంభించామన్నారు. ఒక వార్త ఛానల్‌గా మా గల్ఫ్‌ను ఆదరించిన పాఠకులు, పనిచేస్తున్న మా గల్ఫ్ టీమ్ మెంబర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పాటల పోటీల్లో విజేతగా నిలిచిన కోరుట్ల మండలం మోహన్‌రావుపేటకు చెందిన బీనవేణి రంజిత్‌కు సినీ రచయిత చంద్రబోస్ చేతులమీదుగా సత్కరించారు. అనంతరం వివిధ సంఘాల నాయకులు, సామాజిక సేవకులను సన్మానించారు. కార్యక్రమంలో మా గల్ఫ్ ప్రతినిధులు, టీమ్ మెంబర్లు పాల్గొన్నారు.

బల్దియాలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయండి

జగిత్యాలటౌన్: తాగునీరు, వీధిదీపాలు, శానిటేషన్ వంటి సమస్యలకు తక్షణ పరిష్కారానికి జగిత్యాల బల్దియాలో గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేయాలని జీవన్ రెడ్డి కలెక్టర్‌కు లేఖ రాశారు. పాలకవర్గాలు ఉన్న సమయంలో ప్రజలు కౌన్సిలర్ల ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకున్నారని, ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్నందున మున్సిపల్ కార్యాలయంలో గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేస్తే వారికి సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు.

కలెక్టర్‌కు ఆంజనేయస్వామి చిత్రపటం బహూకరణ

మల్యాల: ఆంజనేయస్వామి చిన్న జయంతి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం ఆలయ ఈఓ శ్రీకాంత్ కలెక్టర్ బి.సత్యప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, ధన్యవాదాలు తెలిపారు. ఆంజనేయస్వామి చిత్రపటం అందజేసి, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్ పాల్గొన్నారు.

ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు

జగిత్యాలక్రైం:పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలకు మరింత మెరుగైన సేవ అందిస్తున్నామని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 13 మంది నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

రజతోత్సవ సభ విజయవంతం చేయాలి

మల్లాపూర్: ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు బండి లింగస్వామి అన్నారు. భరతమాత కూడలి వద్ద సోమవారం ఆటో యూనియన్ తరుపున రూ.2 వేలు అధ్యక్షుడు శివరాత్రి నర్సయ్య ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, భూక్య గోవింద్‌నాయక్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్ ప్రవేశ పరీక్ష హాల్ టికెట్లు విడుదల

జగిత్యాలరూరల్: మండలంలోని కండ్లపల్లి మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష హాల్ టికెట్లను విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ సరిత దేవి పేర్కొన్నారు. 2025–26 విద్యాసంవత్సరానికి గాను ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో నిర్వహించే 6–10వ తరగతి ప్రవేశ పరీక్షల హాల్‌టికెట్లు **telanaganams.cgg.gov.in** వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈనెల 27న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 6వ తరగతి, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు 7–10వ తరగతి ప్రవేశ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు.

పాఠశాలల్లో తల్లిదండ్రుల భాగస్వామ్యం పెరగాలి

సారంగాపూర్: విద్యార్థులు ఉత్తమ విద్య పొందడానికి తల్లిదండ్రుల భాగస్వామ్యం పెరగాలని డీఈవో రాము అన్నారు. బీర్‌పూర్ మండల కేంద్రంలోని పీఎంశ్రీ ప్రాథమిక పాఠశాలలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాలల్లో విద్యను మెరుగు పచడానికి పెద్ద మొత్తంలో నిధులు వెచ్చిస్తున్నాయని, వాటిద్వారా సత్ఫలితాలు రావాలన్నారు. కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, ఎంఈవో నాగభూషణం, కాంప్లెక్స్ హెచ్‌ఎం నర్సింహ్మమూర్తి, హెచ్‌ఎం సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలతో విద్యార్థుల ప్రతిభకు పదును

జగిత్యాల: ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలంటే పోటీ పరీక్షల్లో పాల్గొనాలని డీఈవో అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్, గణిత, భౌతిక, జీవశాస్త్ర ఫోరం సభ్యులు శ్రీకాంత్, అశోక్, రాజ్‌గోపాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.